01079601

బహళ విద్యలయ్యె వాంఛలు మితిమీరె
పలుకులందు వీరో పనికి జీరో.
తెలివి పేటలు ఎన్నో ఉండి ఫలంబేమి
కొంచెమైన ఆచరించరయ్య.

విద్యార్థులారా!

ఈనాటి విద్యలు కేవలము భౌతికమైన సుఖశాంతుల నిమిత్తము పాకులాడు చున్నాయి గాని సమాజము యొక్క సంక్షేమము నిమిత్తమైగాని, ధర్మ స్థాపన నిమిత్తమైగాని, లోక శాంతి నిమిత్తమై గాని ఈ విద్యలు ఏమాత్రం ప్రవేశించటం లేదు. విద్యార్థులుగాని, విద్యావంతులు గాని అమితమైన జీతము నాశించి ఉద్యోగము లో ప్రవేశించుటకు ఎంతయో ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగము పురుష లక్షణము. ఉద్యోగము ఆచరించటము దేశ పరిపాలన నిమిత్తమై కాక స్వార్థము నిమిత్తమై ఈ విద్యలను కొంత వరకు ఉపయోగించు చున్నారు. తెల్లవారి ఎనిమిది గంటలకు ఆఫీసులకు వెళ్ళి లేక కళాశాలలకు వెళ్ళి సాయంకాలము నాలుగు గంటలకు తిరిగి ఇంటికి వస్తున్నారు. ఆఫీసుల యందు, కళాశాలలందు తాము ఏదో శ్రమ పడి నట్లుగాను తీరని పనులలో మునిగినట్లుగా ఇంటికి వచ్చిన తక్షణమే తమ డ్రస్సు మార్చుకొని, అలంకరించుకొని విశ్రాంతి నిమిత్తమై, శాంతి నిమిత్తమై క్లబ్బులలో ప్రవేశిస్తున్నారు. ఈ క్లబ్బులలో శాంతి ఉన్నదా? ఈ క్లబ్బులు విశ్రాంతి నందిస్తున్నదా? లేదు లేదు.

ఇది కేవలము విద్యావంతుల బలహీనత. నిజముగా విశ్రాంతి కావాలంటే bedroom లో పడకపై పడుకో వచ్చు. కాని ఈనాటి విద్యావంతులు తమ శాంతి, తమ విశ్రాంతి క్లబ్బులలో నున్నదని భ్రమించి ఆ క్లబ్బుల లో ప్రవేశిస్తున్నారు. అక్కడకు వెళ్ళి ఏమి చేస్తున్నారు ఈ విద్యావంతులు. కార్డ్సు ఆడుతున్నారు. ఇంతటిలో ఆగక bottles తీసుకుంటున్నారు. దానివల్ల మై మరచిపోయి అలసట తీరుతుందని భావిస్తున్నారు. ఇది ఉత్తమ మార్గమా? అధో మార్గమా? ఇది విద్యావంతులు చేయవలసిన పనియా విద్యాహీనులు చేయవలసిన పనియా? ఇందులో శాంతి ఉన్నదని తప్పతాగి మై మరచి ఏదో శాంతిని పొందాను అని భ్రమిస్తున్నారు. కాని ఇది చాలా ప్రమాదకరమైనది. తనను తాను చెడ

పోవటమే కాక సమాజమును చెడగొట్టి గృహమును కూడ అనేక అష్టకష్టములకు గురిచేస్తున్నాడు. ఇట్టి దురభ్యాసములు మానుకొని, ఇట్టి దురభ్యాసములకు అవకాశము నందించక గృహసంబంధమైన కార్యములలో లేక సమాజ సంబంధమైన కార్యములలో ప్రవేశించి తమ విద్యను సార్థకము గావించుకోవాలి. ఈ త్రాగుడు ఎంతవరకు బయలుదేరుతున్నాది. First man drinks wine next wine drinks the wine. next wine drinks man. కట్టకడపటికైన తననే మింగివేస్తుంది. ఈ సత్యము గుర్తించుకొనలేక తెలివితేటలు గలవారమని భ్రమించి ఈవిధమైన అపమార్గములలో ప్రవేశిస్తున్నారు. ఏదో తమ మిత్రులకు సహాయము చేసినట్లుగా భావిస్తుంటారు. ఏమిటి? తనతో cards ఆడటానికి వచ్చిన వానికి thanks చెప్పటము. తనతో బాటు టేబులు దగ్గర bottles తీసుకున్న వానికి thanks చెప్పటం. ఇది ఎంత విద్యాహీనమైనదో మీరు చక్కగా యోచించుకోవచ్చు. విద్య యొక్క సమాజ లక్షణము కాదు.

మనము ఒక గ్రామములో నుండినప్పుడు, ఎవరైనా మనకు సహాయము చేసినప్పుడు, మాట్లాడినప్పుడు thanks అంటాము. మన కోర్చీఫ్ క్రిందపడినప్పుడు ఎవరైనా తీసి ఇస్తే thanks అంటాము. నీరు మన గృహమునకు సప్లై చేసినందుకు water tax కడుతున్నాము. మన ఇంటికి కరెంటు సప్లై చేస్తే దానికి electricity charge లేక tax కడుతున్నాము. మనము కొనుక్కున్న స్థలములో ఇల్లు కట్టుకుంటే house tax ఇస్తున్నాము కార్పొరేషనుకు. భగవంతుడు అనుగ్రహించే వరప్రసాదము ఎట్టిది? ఫ్యాను వేసుకుంటే కరెంటుకు ఛార్జి కడుతున్నాము. భగవంతుడు మలయమారుతము ఇస్తుంటే ఏమి టాక్సు కడుతున్నాము. సూర్యుడు దేదీప్యమానముగా ప్రకాశిస్తూ జగత్తుకు వెలుగునందిస్తున్నందుకు సూర్యునికి ఏమి tax అందిస్తున్నాము. కుంభవర్షము కురిసి వంకలు ప్రవహించి చెరువులు నిండించి ఎక్కడ చూచినా జలము నందించినందుకు భగవంతునికి మనము ఏమి tax ఇస్తున్నాము. అల్పమైన స్వల్పమైన విషయాలకు tax కడుతున్నాము. భగవంతుడు అనుగ్రహించునవన్నీ free. గాలి free., నీరు free వెలుతురు free అంతా free గా ఇస్తున్నాడు భగవంతుడు. భూమి భగవంతుడు అనుగ్రహించినదే. పంచభూతములన్నీ భగవంతుని స్వరూపములే. భగవంతునివి అనుభవిస్తూ భగవంతునికి మనము ఏమి tax కడుతున్నాము. ఏమానవుడైనా విద్యావంతుడైనా విచారణ సల్పుతున్నాడా? అనిత్యము అశాశ్వతము, అసత్యము అయినవిషయములకు మనము యెంతో tax కడుతున్నాము

ఎంతయో కృతజ్ఞత తెలుపుకుంటున్నాము. నిత్యమైన సత్యమైన శాశ్వతమైన జీవితమునకు అవసరమైన సమస్త వస్తువులు అందించినందుకు ఏమి ఇంక అడుగుతున్నాము. ఇంకా భగవంతుడా అది ఇవ్వలేదు ఇది ఇవ్వలేదు అని దూషిస్తుంటాము. ఉపకారమునకు బదులు అపకారము సలుపుతున్నాము. ఇచ్చినదానికోసమైన ఋణం చెల్లించటం లేదు. ఇంకా ఇవ్వలేదని ఆశించటం ఎంత దురాశ. ఈ దురాశ పెరిగిపోవటం చేత దుర్గుణములు కూడా పెరిగిపోతున్నాయి, దుర్గుణములు పెరిగిపోవటంచేత దురహంకారము పెరిగిపోతున్నది.

దురాశ, దురహంకారము, దుర్గుణములు మానవుని సహజ లక్షణములు కావు. శాంతము, సహనము, సానుభూతి ఇవియే మానవుని ప్రధాన లక్షణములు. నిజముగా మానవుడు సంతృప్తిగా జీవించాలి. ఈనాటి మానవుడు సంతృప్తి లేకుండా ఉంటున్నాడు. తృప్తియే లేదు. ఒకానొక సమయంలో ఒక భక్తుడు నారాయణుని దర్శించాడు. 'నారాయణా నీవు ఎందుకోసం ఈ మేరు పర్వతము సృష్టించావు. బంగారు కొండను సృష్టించావు. ఓ భగవంతుడా అడవులను పెంచి మానవులకు జీవశక్తిని ప్రసాదిస్తున్నావు. మానవుడు వదిలిన కార్బన్ డయాక్సైడ్ పీల్చుకొని ప్రాణవాయువునందిస్తున్నాయి. కొండలు సృష్టిస్తున్నావు. కదలిపోయే మేఘములను ఆపి వర్షము కురిపిస్తున్నావు.

వాలిగ నెక్కిడు చంద్రమఖండ కళతోడ
జడగారు గుంపెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జగితోడ
ఉంబైన ఫాలనేత్రంబు తోడ
నల్లనేరేడు వంటి నల్లని మెడతోడ
కరమున నాగకంకణము తోడ
నడుమును చుట్టిన నాగచర్మము తోడ
మైనిండ నలదు భస్మంబు తోడ
నుదుట తీర్చిన దొడ్డ కుంకుమబొట్టుతో
తాంబూల రాగాధరమ్ము తోడ

01079604

చటుల హేమ మయ వజ్ర తాటంకముల వాడ
విక్షక్ష వజ్రయా దృష్టి వాడ
నల్లకలువల దనుమాడి కాళ్లలాడు
మెరుగు చామన చాయ మేని వాడ

భగవంతుడు సుందరమైన జగత్తుకు మరింత సుందరమును కలిపిస్తూ వెళ్ళాడు. ఎక్కడ పెట్టుకున్నాడు చంద్రుని. లైట్ హౌస్ మాదిరి పెట్టుకున్నాడు భగవంతుడు. చల్లదనము అందరికి అందిస్తున్నాడు. జడల నుంచి ప్రవహించే నదులతో, ఫాలనేత్రముతో జగత్తునంతా మెరిపించి మురిపించే సృష్టిని తాను కల్పించి సర్వమానవులను సుఖశాంతుల నందిస్తూంటే ఈ కల్పితమైన అల్పమైన సుఖశాంతుల నిమిత్తమై అఱ్ఱులు చాస్తున్నాడు మానవుడు. ఇటువంటి హృదయమును మానవునకు అనుగ్రహించాడు. ఎట్టి హృదయము? చల్లని హృదయము. కరుణా హృదయము, ప్రేమ హృదయము, జాలి హృదయము. ఇలాంటి హృదయము నందించినా మనము పాడు చేసుకుంటున్నాము. ఈ విధమైన హృదయమును మనము అపవిత్రము గావించుకోటం కేవలము మానవత్వమునకే పరువు లోటుగా ఉంటున్నది.

ఇంత అనుగ్రహము నందించిన భగవంతునికి మనము టాక్స్ కట్టాలి. ప్రాచీన కాలమునుండే మహర్షులు బలి అని పేరు పెడుతూ వచ్చారు. భగవంతునకు బలి ఇవ్వాలని. ఒక ప్రాణిని భగవంతునకు బలి ఇవ్వాలని అపార్థము చేసుకున్నారు ప్రజలు. బలి అనగా ప్రాణిని హింసించటం కాదు. బలి అనగా టాక్స్ అని అర్థము. పదమునకు ఎన్ని అర్థములో ఉంటున్నాయి చిన్న ఉదాహరణము. మనము శిఖండి అని పిలుస్తాము. శిఖండి అనగా మగ ఆడ కానివాన్ని శిఖండి అని పెడార్థము తీసుకుంటున్నాము. నారాయణుని పేరే శిఖండి. నెమలి పింఛము ధరించువాడని అర్థము. కృష్ణుడు. ఇలాంటి పవిత్రమైన అర్థములు ఎన్నియో ఉండగా దీని మనం అర్థము చేసుకొనక కేవలం అనర్థాలు తీసుకొని దీనిని యదార్థముగా విశ్వసిస్తున్నాము. బలి అనగా హింసించటం కాదు. భగవంతుని టాక్స్ అందించాలి. మన యొక్క కృతజ్ఞత భగవంతునికి తెలుపుకోటమే టాక్స్. అది ఏ విధంగా తెల్పుకోటం. ప్రార్థనలో తెల్పుకోటమే. నీ హృదయమునుండి ఆవిర్భవించిన ఆనందమును భగవంతునికి వాక్ రూపములో అందించటమే.

దీనినే పోతన కూడా చెప్పాడు చూడుమా।

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని

కంఠమెత్తి ఏ అభిమాన మమకారములు లేకుండా ఎంతమంది వింటారో ఏమిటోనని, ఎగతాళి చేస్తారేమోనని త్యాగం చేసి కంఠము ఎత్తి భగవంతుని ప్రార్థన చేయాలి. కొంతమంది కంఠం ఉండి కూడా భగవంతుని నామాన్ని స్మరించలేక పోతున్నారు. ఎందుకు వారికి నాలుక ఉంది కేవలం తినటానికా? నాలుక ఉండి కూడా భగవంతుని భజనలు పాడలేక పోతున్నారు. ఇది కేవలం కర్మఫలమే. ఇది కేవలం కప్పనాలుక మాత్రమే. నాలుక ఉన్నది ఎందుకోసం? భగవంతుని నామాన్ని స్మరించటానికే నాలుక ఇచ్చాడు. అతని స్మరించి ఆ ఋణం చెల్లించుకో. లేకపోతే నీవు ఋణగ్రస్థుడైపోతావు. చేతులుండి కూడా భగవంతుని భజించలేక పోయినప్పుడు చేతులుండి ఏమి ప్రయోజనము?

భగవంతుని ఋణం చెల్లించుటకు ఒక పద్ధతి ఉంది. అది మనం చెల్లించలేక పోతే ఋణగ్రస్థులమై పోతాము. భగవంతుని దూషించిన వారమవుతాము.

పరుల దూషించిన పాప ఫలం బబ్బు
పరులు కాదు వారు పరమాత్మయే కదా!

పరులు పరులు అని అనుకుంటున్నాము. పరులెవరు లేరిక్కడ. పరమాత్మయే ఉండేది. పరులంతా పరమాత్మ స్వరూపులే. కనుక ఎవరిని మనం విమర్శించరాదు. ఎవరిని మనం దూషించరాదు. అందరికి తగిన కృతజ్ఞత నందించాలి. జగత్తులో ప్రతి మానవుని వద్దనుండి ఎంతో ఇంతో ఉపకారం మనం అందుకుంటున్నాము. కనుక మనము అనేక యుక్తుల చేత ఈ బాధలు తప్పించుకొనుటకు పన్నాగము పన్నుతున్నాము. నిజముగా ఈనాటి విద్యలన్నీ పెడమార్గము పట్టిస్తున్నాయి. దానికి ఒక కథ ఉంది. మీకందరికి తెలుసు. అనేక పర్యాయములు చెప్పాను.

ఒక కాలువలో ఒక మొసలి జీవిస్తూ ఉండేది. ఆ కాలువ పక్కన ఒక పెద్ద వృక్షము ఉండేది. ఆ వృక్షముపై ఒక కోతి నివసిస్తూ ఉండేది. ఆ వృక్షము నేరేడు వృక్షము. ఆ ఫలములన్నీ భుజిస్తూ ఉండేది. ఇవి భుజించటం, క్రింద పడవేయటం. ఆ క్రింద పడవేసిన నేరేడు పండ్లను మొసలి తినేది. ఆనందించేది. ఈ విధంగా జీవించి ఆ మొసలి బలిసింది. ఈ కోతికి, మొసలికి చక్కని స్నేహం ఏర్పడింది. ఈ మొసలి చెప్పింది 'ఓ కోతి బావా! నీ దగ్గర నుండి నేను విందు ఆరగిస్తూ

న్నను. కనుక నీవు కూడా ఒక రోజు మా ఇంటికి వచ్చి మా విందు ఆరగించాలంది. కోతికి ఆశ్చర్యం వేసింది. ఇది ఎక్కడికి రమ్మంటున్నది. ఎక్కడ నివసిస్తున్నది అని ఆలోచించింది. ఈ కోతి మానవుని పూర్వజన్మలోవి. బాగా తెలివితేటలు ఉన్నాయి. పిచ్చి కోతి అని మనము అంటాం. కాని కోతికున్న తెలివితేటలు మనిషికి కూడా లేవు. అందువలనే శ్రీరాముని దాసుడుగా తయారయ్యాడు హనుమంతుడు. ఎంత కార్యమును సాధించాడు. సరే అని ఈ కోతి ఒప్పుకుంది పాపం. నేనెలా వచ్చేది మీ ఇంటికి ? నేను నీటిలో ఈదలేను. నీవు నీటి నుండి గట్టుకు రాలేవు. కనుక నేను మీ ఇంటికి రాలేనంది. అయ్యో ఓ స్నేహితుడా! నాకు ఇంత పెద్ద దేహముంది నా వీపు మీద కూర్చో నేను తీసుకుపోతాను పడవ మాదిరి. సరిగ్గా ఆ పక్క గట్టుకు చేరటానికి ముందుగా చెప్పింది మొసలి తన రహస్యాన్ని. 'లేదు లేదు. బావా నీ గుండెను తినాలని నా భార్య చాలా ఆశపడుతున్నది. నా భార్యను తృప్తి నివ్వాలి. అందుకొరకు నిన్ను ఇక్కడకు తెచ్చాను'. అంది. కోతి చాలా యోచన చేసింది. 'ఓరి పిచ్చివాడా! నీ భార్యను తృప్తి పరచటం నాకు కూడా సంతోషమే. కానీ అప్పుడే ఎందుకు చెప్పలేదు. నా గుండెను, ఎప్పుడు ఎగురుతూ ఉంటాను కనుక ఎక్కడన్నా పడిపోతుందేమోనని చెట్టుకి తగిలించి వచ్చాను. తిరిగి వెనక్కి పద అంది. ఒక దగ్గర గుండె భద్రముగా పెట్టాను. పద వెనక్కి పోదాం. తీసుకొని వచ్చేద్దాము అంది. ఈ మొసలికి శక్తి దండిగా ఉంది గాని బుద్ధి లేదు. ఈ నాటి విశ్వాసం మూలవాటి ఉంది. గుండె ఇస్తుందని నమ్మకంతో వెనుకకు వచ్చింది. ఉండు ఇక్కడే నేను పైకి పోయి గుండె తెస్తాను అని చెట్టెక్కి పోయింది. 'ఓ పిచ్చి మొసలీ! గుండెను తీసి తగిలించుటకు వీలవుతుందా ? ఈ మాత్రం నీకు బుద్ధి లేదా? ఇలాంటి వారితో స్నేహము నాకక్కర లేదు. నేను నీకు ఉపకారం చేస్తే కడుపుటికి నన్నే చంపటానికి నీవు ప్రయత్నించావా? ఇదా కృతజ్ఞత ఇలాంటి కృతజ్ఞత లేనివారి స్నేహం నాకు అక్కర లేదు'. మనం భగవంతునికి కృతజ్ఞత చూపాలంటే ఈ విధముగా చేయకూడదు.

హృదయమును భగవంతునకు అర్పితం చేయాలి. అదే మనకు మైత్రి దయ. ఇది కూడను నివేదించుటదే. నేను తెచ్చుకొన్నది కాదు.

ఈ హృదయంబు నా సగితివా ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి

నీవు ఇచ్చినదే నీకు అందిస్తున్నాను. నేను ఎక్కడనుండి తేగలను. I am nothing. Everything is yours. 'పరగ నీకేమి తెత్తు నీ పాదార్చనకు, అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు'. ఇదే నేను

అందించేది. అంతకంటె నేనేమి ఇవ్వగలను. నా సర్వస్వము నీవు ఇచ్చిన సొత్తే. ఇంక నాదగ్గర వేరే ఏమున్నది ? ఏమైనా ఉంటే అది నీవిచ్చినదే. అంతా నీదే. నాది అనేది ఎక్కడా లేదు. అంతా నీదే. ఇది భగవంతునకు ఇవ్వవలసిన tax. అది ఇవ్వనంత వరకు ఎన్ని జన్మలైనా మనం ఎత్తవలసిందే. ఎన్ని రూపములైనా ధరించవలసిందే. ఆస్తికుడైనా, నాస్తికుడైనా, ఆస్తిక నాస్తికుడైనా ఇవ్వవలసింది ఇదే.

ఇలాంటి పవిత్రమైన tax ని మనం అందించటానికి సిద్ధం కాకుండా భక్తులు భక్తులు అని అనిపించుకుంటున్నాం. భక్తి అనేది వేరే. అది ఒక డిగ్రీగా ఉంటున్నది. ఈనాడు ఏదైనా ఉద్యోగం కావాలంటే పేరు వ్రాస్తారు MBA, లో MFA లో వ్రాసుకుంటారు. ఈ డిగ్రీ చూసే ఉద్యోగాలు ఇస్తుంటారు. ఉద్యోగానికి పోవాలని అనుకున్నాడు, రామయ్య TDFS అని వ్రాసాడు. ఏమిటి రా ఈ డిగ్రీ ఎక్కడనుంచి వచ్చింది అని ఆశ్చర్యపోయారు. TD ten daughters F.S five sons. ఇవి నా డిగ్రీ అన్నాడుట. పిల్లలను కనటమే డిగ్రీ. ఈనాటి మానవుని డిగ్రీ ఇదా? అది కాదు మన డిగ్రీ. 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః' అదే మన డిగ్రీ. నేను భగవంతుని దాసుడను, భగవంతుని అంశమును. ఆవిధమైన దివ్యమైన తత్వాన్ని మనం అనుభవించాలి. నీవు నా అంశమే. ప్రకృతి అంశ కాదు. పంచ భూతముల అంశ కాదు. సాక్షాత్తు నా అంశమే అన్నాడు భగవంతుడు. ఇలాంటి డిగ్రీలు మనం తీసుకోకుండా మట్టివైన వాటి కోసం ప్రాకులాడి కట్టకడపటికి వెళ్ళి పోతున్నాము

శతవర్షములదాక జీవితము దెప్పితిగాని
నమ్మరాదా మాట నెమ్మనమ్మున
బాల్యమందో లేక ప్రాయమందో
లేక ముసలియందో లేక ముదిమియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎప్పుడో విడిచేది ఎరుక లేదు
మరణమది నిశ్చయము

ఎప్పటికైనా అది నిశ్చయము. కనుక ముందుగానే నీకర్పితము చేస్తున్నాను. ఇది సత్యమైనది కాదు దేహము ఒక నీటి బుడగ. mind is like a mad monkey. Don't follow the mind don't follow the body. follow the conscience. అదే హృదయము. ఆ హృదయమును అర్పితము చేయి. ఆ హృదయాన్ని అర్పించే నిమిత్తమై మనం భగవన్నామంగా తయారు కావాలిగాని

ఏదో పండో, ఫలమో, పత్రమో ఇవన్నీ అర్పించుటకు కాదు.

భగవంతుని దగ్గర లేనివి ఏవి మీదగ్గర లేవు. అన్నీ భగవంతుని దగ్గరున్నాయి. ఇంకా ఎటువంటివి ఉన్నాయో ఎవరికీ తెలియదు. అంత విలువైనవన్నీ ఉన్నాయి. భగవంతుని దగ్గర. కొన్ని యిచ్ఛమైన ఫలములందించటం, వాడిపోయే పుష్పములందించటం ఇలా మనం అందించ వలసిన [illegible]. దేహమనే పత్రము, హృదయమనే పుష్పము, మనస్సు అనే ఫలము, ఆనందమనే తోయము. ఆనంద బాష్పములందించాలి. అంతేగాని శోక బాష్పములు కావు. ఈ విధంగా మనం భగవంతునికి అందించవలసినవి ఎన్నో ఉంటున్నాయి. కాని అట్టి నిత్య సత్యమైన విషయాలు స్మరించటానికి ప్రయత్నించటం లేదు. మనదృష్టికి గోచరించేది మన చర్మ చక్షువులకు కన్పించేది మనం అందిస్తున్నాము. ఈ దృశ్య కల్పితమైన వస్తు ఏదో ఒకనాటికి అనిత్యమే. అంతా నాస్తి. నాస్తి. ప్రతి ఒక్కటీ అనిత్యము. సత్యమనేది ఒకటే. నా జీవము, దైవశక్తి ఈ రెండింటి ఏకత్వమే కైవల్య తత్త్వము. కనుక ఈనాడు విద్యా విషయములను సక్రమమైన మార్గంలో మనం ప్రవేశపెట్టాలి. కార్డ్స్ ఆడటంలో మనకు శాంతి లేదు. తినటంలో మనకు శాంతిలేదు. త్రాగటంలో మనకు శాంతి లేదు. టీవీలో శాంతి ఉంటే 24 గంటలు ఉంటూ కూర్చో వచ్చుకదా! ఇవన్నీ కేవలం అపమార్గములో నడిపించ రాక్షస మార్గములో ప్రవేశింప చేస్తున్నాయి. మనము త్రాగటానికి, తినటానికి పుట్టిన వారము కాము మన నిమిత్తమై ఆహారము పుట్టినది గాని ఆహారనిమిత్తమై మనం పుట్టలేదు. కనుక మనము సత్యమైన మన జ్ఞానమును, జీవితమును ఆదర్శవంతమైనరీతిలో ప్రజలకందించాలి. మనలాంటి మానవులకు పవిత్ర మార్గమును మనం బోధించాలి. ఏది సత్య నిత్యమైన తత్త్వమో అది ప్రజలకు బోధించటానికి ప్రయత్నించాలి.

విద్యార్థులారా! మీరు చదివిన చదువులలోని సారమంతా ప్రజలకందించి వారు సద్గతి మార్గంలో నడుచునట్లుగా చూచుకోవాలి. విద్య కేవలం పొట్టకూటికోసం కాదు. విద్య విజ్ఞానం కోసం. విజ్ఞానం కావాలి. ఏమిటి ఆ విజ్ఞానము! నిత్యానిత్య పరిశీలనా శక్తి, విచక్షణా జ్ఞానములో కూడినది విజ్ఞానము. మనము ఈనాడు అనేకమంచిని కళ్ళతో చూస్తున్నాము. మన అశాంతి ఎక్కడనో. దానికి చేసే ప్రయత్నం ఏమిటో అర్థమే కావటం లేదు. ఈ రోగమునకు తగిన ఔషధము మనమందించటం లేదు. కడుపులో నెప్పి పుడితే కండ్లలో కాటుక పెడితే కడుపునొప్పి ఏమైనా తగ్గుతుందా? రోగం ఒకటి మన మిచ్చే ఔషధం మరొకటి. అదే విధంగా

మన అశాంతి ఒకటి. ఆ అశాంతి తీర్చేందుకు మరింత అశాంతికరమైన పనులే చేస్తున్నాము మనం. ఒక తండ్రికి ఏకైక పుత్రుడుంటున్నాడు. వాడు ఏదో ఆడుకుంటున్నాడు. బాల్ను తెచ్చుకుందుకు మూలగా వెడితే తేలు కుట్టింది. 'నాన్నా తేలు కుట్టిందని ఏడ్చుకుంటూ వచ్చాడు. కుమారుడంటే చాలా ప్రేమ తండ్రికి. కుమారుడికి తేలు కుట్టిందని డాక్టరు దగ్గరకు పరుగెత్తాడు. డాక్టరు అయింట్మెంటు ఇచ్చి తేలు కుట్టిన దగ్గర దీనిని పెట్టు, కొంత మత్తెక్కుతుంది, నెప్పి తెలియదు అన్నాడు. కానీ ఆ తండ్రి ఆత్రుతగా ఏమాత్రం గుర్తించక ఎక్కడ తేలు కుట్టిందిరా! అన్నాడు. 'నాన్నా ఆ మూల కుట్టింది' ఆ అయింట్మెంటు తీసుకొని పోయి ఆ మూల రాసాడు. ఆ మూల రాస్తే ఆ నొప్పి పోతుందా! ఎక్కడ కుట్టిందో అక్కడ రాయాలి గాని. తేలు ఏ మూల కుట్టిందో ఆ మూల రాస్తే నొప్పి పోతుందా! ఈనాటి ప్రయత్నములన్నీ అలాగే ఉన్నాయి.

మన అశాంతి ఎక్కడనుండి వచ్చింది? దానిని గుర్తించి మన అశాంతిని నిర్మూలం గావించుకొనేందుకు తగిన ప్రయత్నం చేయాలి. ఆ సత్యాన్ని గుర్తించుకోలేక బాధ ఒక చోట ఉంటే ఇంకొక చోట దాని నివారణ ప్రయత్నం చేస్తున్నాము. భగవంతుడు ఎక్కడున్నాడని ఊరూరా తిరుగుతున్నాము. కొండలన్నీ తిరుగుతున్నాము. హిమాలయములు తిరుగుతున్నాము. దైవము ఎక్కడ లేడు ఎక్కడ చూచినా ఉన్నాడు. దైవం ఎక్కడో బయట లేడు. నీ హృదయ స్థాయిలోనే ఉన్నాడు. He is with you. above you, around you, below you. అలాంటి దైవత్వం కోసం ఎక్కడో నీవు ప్రయత్నం చేస్తుంటే ఎలా దొరుకుతాడు. నీ దృష్టిని అంతర్ముఖం గావించుకో. ఆ విశ్వాసము నీవు దృఢపరచుకో. అంతేగాని ఇక్కడ దైవముంది అక్కడ లేడు అనుకునేవాడు సరైన జ్ఞాని కాదు.

ఇక్కడ అక్కడ ఎక్కడ చూచిన
ఒక్కడే ఆత్మలో మకాము ఉండును.

ఎక్కడ చూచినా ఒక్కడే ఉంటున్నాడు. రెండవది లేనే లేదు. ఏకమేవ అద్వితీయం బ్రహ్మ. నా దేవుడు, నాదేవుడు అని లేదు. ఇవన్నీ కేవలం అజ్ఞానము యొక్క లక్షణము. రాముడు వేరు కృష్ణుడు వేరు కాదు. శివుడు వేరు రాముడు వేరు కాదు. రూప నామములు వేరు గాని దైవము ఒక్కడే. ఇట్టి ఏకత్వాన్ని విశ్వసించి ఎక్కడైనా సరే హృదయపూర్వకంగా ప్రార్థించు. అక్కడ వెంటనే సాక్షాత్కరిస్తాడు.